కేటీఆర్ అల్టిమేటం..

దిగొచ్చిన సర్కారు

- యుద్ధ ప్రాతిపాదికన చర్యలు తీసుకున్న యంత్రాంగం
- మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లోకి నీళ్లు
- చివరి పంటకు నీరందిస్తామని అధికారుల వెల్లడి
- అన్నదాతల్లో ఆనందం

సిరిసిల్ల రామప్ప గుట్ట శివారులోని మధ్యమానేరు పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు తరలుతున్న జలాలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 4 (నమస్తే తెలంగాణ)/ కోనరావుపేట: రైతులకు 48గంటల్లో సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడకుంటే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ కార్యాలయ చాంబర్ ఎదుట ధర్నా చేస్తానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన అల్టిమేటంతో రేవంత్ సర్కార్ దిగొచ్చింది. మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలోని కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఈఈలు కిశోర్, అమరేందర్‌రెడ్డి మధ్యమానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే పంపులను ప్రారంభించారు. ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలలో సాగునీరందక వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు కేటీఆర్‌కు ఫోన్ చేసి మొరపెట్టుకున్నారు. దీంతో కేటీఆర్ ఆదివారం జిల్లాకు వచ్చి పార్టీ నేతలతో కలిసి తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో పర్యటించారు. అక్కడి రైతులు కేటీఆర్‌కు ఎండిన పొలాలను చూపిస్తూ ఆరుగాలం చేసిన కష్టార్జితం పశువుల పాలైందంటూ గోడు వెళ్లబోసుకున్నారు. చలించిన కేటీఆర్ బీఆర్‌ఎస్ కార్యకర్తలందరూ అండగా ఉంటారని ధైర్యం ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మధ్యమానేరులో నీళ్లున్నా ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నదంటూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. 48 గంటల్లో నీటిని విడుదల చేయకుంటే నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాంబర్ ఎదుట ధర్నా చేస్తానని హెచ్చరించారు. ఇప్పటికే 450 మంది రైతులను పొట్టపెట్టుకున్న ప్రభుత్వం ఇంకెంత మందిని బలితీసుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనంవల్లే సిరిసిల్ల, తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. కేసీఆర్ కాళేశ్వరం నుంచి నీళ్లు తీసుకొచ్చి మధ్యమానేరు ద్వారా మల్కపేట రిజర్వాయర్ నింపిన విషయాన్ని గుర్తుచేశారు. మధ్యమానేరులో నిలువ ఉన్న 16 టీఎంసీలలో ఒక టీఎంసీని కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్‌కు విడుదల చేస్తే సిరిసిల్ల రైతుల సాగుకు సరిపోతుందని, తాగునీటికి మరో 3టీఎంసీలు పోను, ప్రాజెక్టులో 13టీఎంసీల నీరు ఉంటుందని చెప్పారు. కేటీఆర్ అల్టిమేటంతో దిగివచ్చిన సర్కారు నీటిని విడుదల చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ను ఆదేశించింది. కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఈఈ కిశోర్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డితో కలిసి మల్కపేట రిజర్వాయర్‌ను పరిశీలించి, పంపుహౌస్‌లను తనిఖీ చేశారు. సిరిసిల్ల రామప్పగుట్ట శివారులోని మధ్యమానేరు పంప్ హౌస్‌లో ఒకటో మోటర్ ఆన్‌చేసి మల్కపేట రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు మొదలు పెట్టారు. 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న మల్కపేట రిజర్వాయర్‌లోకి 0.5 టీఎంసీల నీటిని విడుదల చేశారు. కేటీఆర్ కృషితో వందలాది ఎకరాలకు సాగునీరందనుండగా, సిరిసిల్ల జిల్లా రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

చివరి పంటకు నీరందిస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యమానేరు నుంచి మల్కపేటకు ఒకటో పంపు ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నాం. తెల్లవారే సరికి రెండో పంపు ప్రారంభిస్తాం. మల్కపేట రిజర్వాయర్‌లో నీటిని నింపి చివరి పంటకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఈఈ కిశోర్, కాళేశ్వరం 9వ ప్యాకేజీ

రంగనాయక్ సాగర్ నుంచి విడుదలకు సన్నాహాలు..

ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని పంటచేలకు రంగనాయక్‌సాగర్ నీటిని విడుదల చేయాలని కేటీఆర్ చేసిన సూచనలతో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల కేటీఆర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఈఎన్‌సీ అనిల్ కుమార్‌కు ఫోన్‌చేసి రంగనాయకసాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన అధికారులు తెల్లవారే ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు.

సీసీఐని తెరిచేదాకా వదలం

ఉద్యోగులు, కార్మికులతో కలిసి పోరాటం

- ఎన్నికల హామీని నిలబెట్టుకోవడమంటే సీసీఐని తక్కుకింద అమ్మేయడమేనా?
- మోదీ తలుచుకుంటే సీసీఐ తెరుచుకోదా?
- సిర్పూర్ మిల్లును కేసీఆర్ తెరిపించలేదా?
- కేంద్ర సర్కార్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ ప్రజలకు ఆయువుపట్టులాంటి సీసీఐని తిరిగి ప్రారంభించకుండా ఆ సంస్థ ఆస్తులను వేలం వేసేందుకు సిద్ధమవడం మోదీ ప్రభుత్వ కుటిలత్వానికి పరాకాష్ట అని, సీసీఐని తుక్కుకింద అమ్మే నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునే వరకు కార్మికులతో కలిసి ఉద్యమిస్తమిస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీని తుక్కుకింద తెగనమ్మేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధం కావడం దుర్మార్గమని మండిపడ్డారు. 772 ఎకరాల భూమి, 170 ఎకరాల టౌన్‌షిప్, 48 మిలియన్ టన్నుల లైమ్‌స్టోన్ నిల్వలతో సకల వనరులు కలిగిన సంస్థను అంగడి సరుకుగా మార్చిన పాపం మోదీ ప్రభుత్వానిదేనని మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సీసీఐకి చెందిన ఎంతో విలువైన యంత్ర పరికరాలను పాత ఇనుప సామాన్ల కింద లెక్కకట్టి ఆన్‌లైన్‌లో అమ్మేందుకు టెండర్లు పిలవడం బీజేపీ ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమని నిప్పులు చెరిగారు. నిర్మాణ రంగంలో సిమెంట్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సీసీఐని పునఃప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని పదుల సార్లు కేంద్ర మంత్రులను తమ ప్రభుత్వం కోరినా, కనీసం వారు కనికరించకపోవటం ఆదిలాబాద్ ప్రజలకు వెన్నుపోటు పొడవడమేనని ఫైర్ అయ్యారు.

కేంద్రమంత్రి మాటలు నీటి మీది రాతలు

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సీసీఐని తిరిగి ప్రారంభించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. సీసీఐని తిరిగి ప్రారంభిస్తే ఆదిలాబాద్‌లోని వేలాది మంది యువతకు ఉపాధి దొరుకుతుందన్న ఉద్దేశంతో ప్రధాని మోదీతో పలుమార్లు ఈ విషయంపై నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్చలు జరిపారని తెలిపారు. తాను స్వయంగా కేంద్ర మంత్రులైన నిర్మలా సీతారామన్, మహేంద్రనాథ్ పాండే, పీయూష్ గోయల్‌ను పలుమార్లు కలవడంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా రాశానని గుర్తుచేశారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం లేదా జాయింట్ వెంచర్ రూపంలో సీసీఐ యూనిట్‌ను తిరిగి తెరిచే విషయాన్ని పరిశీలిస్తామని 2016లో అప్పటి కేంద్ర భారీ పరిశ్రమలు, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ మంత్రి అనంత్ గీతే ప్రకటించారని చెప్పారు. కానీ, కేంద్రమంత్రి మాటలు నీటి మీది రాతలుగానే మిగిలాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినా బీజేపీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సిర్పూర్ పేపర్ మిల్లును తమ ప్రభుత్వమే తిరిగి ప్రారంభించిందని, కేంద్రం తలుచుకుంటే సీసీఐ కూడా పునఃప్రారంభమయ్యేదని వివరించారు. సీసీఐని పునరుద్ధరించాలని ఆదిలాబాద్‌లో వివిధ సంస్థలు, రాజకీయ పార్టీలు చేసిన పోరాటంలో బీఆర్‌ఎస్ నాయకులు ముందుండి కొట్లాడుతున్నారని పేర్కొన్నారు.

సీసీఐని పునఃప్రారంభిస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి, ఓట్లు దండుకున్న బీజేపీ ఇప్పుడు ఆ సంస్థను స్క్రాప్ కింద అమ్మాలనుకోవడం ప్రజలను వంచించడమే. బీజేపీ అంటే నమ్మకం కాదు.. అమ్మకం. సీసీఐ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభించాలని ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసనలు, వారి ఆర్తనాదాలు కేంద్ర ప్రభుత్వానికి వినిపించడం లేదా? –కేటీఆర్

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

2018 ఎన్నికల ప్రచారంలో సీసీఐని తెరుస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ఇప్పుడా సంస్థను స్క్రాప్‌గా అమ్మేందుకు ఆన్‌లైన్ టెండర్లు పిలవడం ఆదిలాబాద్ ప్రజలకు చేసిన మోసమేనని కేసీఆర్ విమర్శించారు. ఆదిలాబాద్ వచ్చిన ప్రతి సందర్భంలో బీజేపీ నాయకులు సీసీఐని తెరిపిస్తామని ఇచ్చిన హామీలను ఇప్పుడు మర్చిపోయారని మండిపడ్డారు. కేంద్ర మంత్రులు అమిత్‌షా నుంచి మొదలుకొని హంసరాజ్ గంగారం వరకు ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో లబ్ధి కోసం సీసీఐని తెరిపిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అప్పనంగా అమ్మేస్తున్నారని మండిపడ్డారు.

ప్రజాఉద్యమ సంస్థలపై నిషేధం సరికాదు

పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ప్రజా ఉద్యమాలు చేస్తున్న సంస్థల నిషేధం సరికాదని పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివాసుల హక్కుల కోసం పనిచేస్తున్న మూలవాసీ బచావో మంచ్ సంస్థను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. మూలవాసీ బచావో మంచ్‌పై పెట్టిన నిషేధాన్ని ఎత్తివేయడంతోపాటు.. ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగిస్తున్న ఆదివాసీ ఉద్యమకారుల హత్యాకాండను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రాహుల్ జీ.. నీతులు ఆపండి!

- ఆ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించండి
- రోహిత్‌పై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు దారుణం
- అసభ్యత అనేది కాంగ్రెస్ నైజం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇకనైనా రాజ్యాంగంపై నీతులు చెప్పడం ఆపాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవుపలికారు. ఒక గుర్తుపై పార్లమెంట్ లేదా అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మరో పార్టీకి వెళ్లిన వారిని అనర్హులుగా ప్రకటించాలని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. 'మీ పార్టీకి నియమ నిబంధనలు, నిజాయితీ ఉంటే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ప్రజాభిప్రాయం కోరాలి. లేదంటే, పార్టీలు మారిన వారిని ఆటోమెటిక్‌గా అనర్హులుగా మార్చడానికి రాజ్యాంగంలో మార్పులు చేయాలనే మీ నీతి ప్రసంగాలు ఆపండి' అని మంగళవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ చురకలంటించారు.

ఇదీ వారి కుసంస్కార స్థాయి

ఇతరుల గురించి అసభ్యంగా మాట్లాడటం కాంగ్రెస్ నేతల నైజమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత క్రికెట్ టీమ్ కెప్టెన్ రోహిత్ శర్మపై కాంగ్రెస్ నేతలు ఎందుకు బాడీ షేమింగ్ వ్యాఖ్యలు చేశారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. రోహిత్ శర్మకు కాంగ్రెస్ ప్రతినిధి నుంచి ఫిట్‌నెస్ సలహాలు, విజయాల సూచనలు అవసరమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వ్యాఖ్యలు క్రూరమైనవని అభివర్ణించారు. సినీ నటుడు, ఆయన కుటుంబంపై తెలంగాణకు చెందిన కాంగ్రెస్ మంత్రి అవమానకర వ్యాఖ్యలు చేసి ఇప్పుడు కోర్టుకు హాజరవుతున్నారని గుర్తుచేశారు. ఇదీ వారి రాజకీయ కుసంస్కార స్థాయి అని మండిపడ్డారు. 'మీకు జరిగిన అవమానానికి తోటి భారతీయుడిగా క్షమాపణలు కోరుతున్నా. మీరు రాక్‌స్టార్.. ఓ వెర్రి రాజకీయ నేత అభిప్రాయం మీ ప్రతిష్ఠను మసకబార్చలేదు' అని రోహిత్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు శుభాకాంక్షలు

బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ధైర్యంగా ఉండి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే.. ఫలితాల రూపంలో బహుమతి దక్కుతుందని పేర్కొన్నారు.

గాయని కల్పన ఆత్మహత్యాయత్నం

- నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి..
- పరిస్థితి విషమం



కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ప్రముఖ గాయని కల్పన నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కేపీహెచ్‌బీకాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గాయని కల్పన నిజాంపేట రోడ్డులోని వర్టెక్స్ ప్రీవీలేజ్ విల్లాస్‌లో నివాసముంటుంది. రెండ్రోజులుగా ఆమె ఇంటి తలుపులు తీయకపోవడంతో పక్క ఫ్లాట్ వారు అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కల్పన ఇంటి తలుపులు తీసి లోపలికి వెళ్లగా.. కల్పన అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే పోలీసులు సమీపంలోని హోలిస్టిక్ దవాఖానకు తరలించగా, కల్పన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

గూగుల్‌లో శోధించి.. గుళ్లలో చోరీ

- ఆభరణాలను వెండి బిస్కెట్లుగా మార్చి తరలింపు
- సొత్తును తరలిస్తుండగా ఇద్దరు దొంగల అరెస్టు

పెద్దఅంబర్‌పేట, మార్చి 4: గూగుల్‌లో ఆలయాలను శోధిస్తారు. రెక్కీ నిర్వహించి రాత్రికి రాత్రి ఆభరణాలు నొక్కేస్తారు. ఆ ఆభరణాలను బిస్కెట్లుగా మార్చి విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఇలా చోరీ సొత్తును తరలిస్తుండగా పట్టుబడిన ఇద్దరిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన మహ్మద్ ఇంతియాజ్ షరీఫ్, రంగా వేణు డబ్బులు సంపాదించడానికి గూగుల్‌లో ఆలయాల గురించి శోధించి విగ్రహాలకు ఉన్న ఆభరణాల చోరీలకు పాల్పడుతారు. మంగళవారం పెద్దఅంబర్‌పేటలోని అవుటర్ రింగు వద్ద అనుమానంతో వీరిని పోలీసులు తనిఖీ చేయగా.. వెండి బిస్కెట్లు కనిపించాయి. విచారించగా పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్టు తెలిపారు. దీంతో వీరిపై కేసు ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి తెలిపారు.

స్కీంల పేరుతో 14 కోట్ల స్కాం!

వెల్‌విజన్‌గ్రూప్ నిర్వాహకుడు కందుల అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 4 (నమస్తే తెలంగాణ): పెట్టుబడుల పేరుతో వందలాదిమంది వద్ద నుంచి రూ.14 కోట్లు వసూలు చేసి బిచాణా ఎత్తేసిన సంస్థ నిర్వాహకుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. డీసీపీ కే ప్రసాద్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కందుల శ్రీనివాసరావు వెల్‌విజన్ గ్రూప్ పేరుతో కార్యాలయం ఏర్పాటు చేశాడు. తాను పెట్టిన స్కీంల్లో డబ్బులు పెడితే లాభాలు వస్తాయని చెప్పి 200 మంది నుంచి రూ.14 కోట్లు వసూలు చేశాడు. ఆ తరువాత లాభాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు.

ప్రజాభవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

భగ్గుమన్న అంగన్‌వాడీలు

- 10 నెలలుగా సగం వేతనాలే
- ప్రజాభవన్ వద్ద మినీ అంగన్‌వాడీ టీచర్ల ధర్నా
- లోనికి వెళ్లకుండా అడ్డగింత
- రాత్రికి రాత్రే ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : పది నెలలుగా ప్రభుత్వం తమకు సగం జీతాలనే చెల్లిస్తున్నదని, నిరుడు మార్చి నుంచి ఇప్పటి వరకు ఇదే తీరున చెల్లిస్తూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నదని, వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని మినీ అంగన్‌వాడీల టీచర్లు మంగళవారం ప్రజాభవన్ వద్ద ధర్నా చేశారు. ముందుగా ప్రజాభవన్‌కు చేరుకున్నవారిని లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టీచర్లంతా అక్కడే బైఠాయించి ఆందోళనకు దిగారు. సర్కారు తీరుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యా దేవరాజన్‌కు వినతి పత్రం అందచేశారు. అంతకు ముందు బేగంపేట రైల్వే స్టేషన్ నుంచి ప్రజాభవన్ వరకు భారీ ర్యాలీ తీశారు. పోలీసులు రెండుసార్లు ర్యాలీని అడ్డుకున్నా పట్టువదలకుండా ప్రజాభవన్‌ను చేరుకున్నారు. కాగా చాలా మందిని సోమవారం రాత్రి నుంచే పోలీసులు ఎక్కడివారిని అక్కడ అరెస్ట్ చేశారు. కొంతమందిని మంగళవారం ఉదయం కూడా పోలీసు స్టేషన్లకు తరలించారని అంగన్‌వాడీ టీచర్ల సంఘం రాష్ట్ర నాయకులు కే సునీత, పీ జయలక్ష్మీ తెలిపారు.

అనేక పోరాటాల నేపథ్యంలో కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలోని 4 వేల మంది మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ జనవరి 1 ఉత్తర్వులు జారీ చేసిందని, కానీ, ఇప్పటికీ మినీ అంగన్‌వాడీలకు ఇచ్చే జీతాలనే (అంటే సగం జీతాలు) చెల్లిస్తున్నారని తెలిపారు.

కొత్తగడి ఘటనపై బీసీ కమిషన్ సీరియస్

- విద్యార్థిని ఆత్మహత్యయత్నం ఘటనపై నివేదిక సమర్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కొత్తగడి సాంఘిక సంక్షేమ హాస్టల్ ఘటనపై బీసీ కమిషన్ సీరియస్ అయ్యింది. ఉపాధ్యాయుల వేధింపులతో పదో తరగతి విద్యార్థిని తబిత పాఠశాల భవనం పైనుంచి దూకగా కాలు విరిగింది. ఘటనకు సంబంధించి విచారణ చేపట్టి పది రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణికి మంగళవారం బీసీ కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంలో కారణాలు తెలుసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కమిషన్ ఆదేశించింది.

ప్రైవేట్ కళాశాలలో ఫుడ్ పాయిజన్?

ఖమ్మం జూనియర్ కళాశాల హాస్టల్‌లో ఘటన

ఖమ్మం అర్బన్, మార్చి 4: ఖమ్మం నగరంలోని ఓ జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కావడంతో దవాఖానకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల హాస్టల్లో ఉంటూ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్న నవ్య, నందిని, కల్యాణి మంగళవారం ఉదయం ఉదయం కడుపునొప్పితోపాటు వాంతులు చేసుకున్నారు. దీంతో సిబ్బంది వెంటనే దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు దవాఖానకు వెళ్లి చికిత్స అనంతరం విద్యార్థినులను తమ ఇండ్లకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కళాశాల బాధ్యులను వివరణ కోరగా.. వారు ముగ్గురు ఆదివారం బయట ఫుడ్ తినడంతో కడుపులో నొప్పి వచ్చిందని తెలిపారు.

స్పీకర్‌కు సుప్రీం నోటీసు!

మొదటిపేజీ తరువాయి...

తీసుకోవడానికి) సముచిత సమయం అంటే అసెంబ్లీ గడువు ముగిసే వరకా? ప్రజాస్వామ్యంలో ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలా? అప్పుడు ప్రజాస్వామ్య సూత్రాలకు ఉన్న విలువ ఏమిటి?. ప్రజలు చట్టం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో అని మాత్రమే ఎదురుచూడరు. ఆ నిర్ణయం ఎటువంటి ప్రభావం కలిగిస్తుందన్నదానిపై ఆసక్తి కలిగి ఉంటారు' అని వ్యాఖ్యానించారు. ఇది ప్రజాస్వామ్య దేశమని, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నమోదైన పిటిషన్లపై తీసుకునే నిర్ణయాలు ప్రజాస్వామ్యబద్ధంగా, సముచిత సమయంలో (రీజనబుల్ టైం) తీసుకోవాలని మరోసారి తేల్చి చెప్పింది. రీజనబుల్ టైం అంటే ఎంతో తేల్చకుండా కాలయాపన వైఖరితో పుణ్యకాలం (అసెంబ్లీ ఐదేళ్ల కాలపరిమితి) ముగిసే వరకు ఉండాలా? అని ఆగ్రహం వ్యక్తంచేసింది. తెలంగాణ హైకోర్టు, పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై స్పీకర్ కార్యాలయం రీజనబుల్ టైంలో తగిన నిర్ణయం తీసుకోవాలని చెప్పిందని గుర్తుచేసింది. ఫిరాయింపుదార్లపై తేల్చకపోతే వాళ్లు చట్టసభ సభ్యులుగా కొనసాగుతూనే ఉంటారని వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్యంతో ముడిపడిన రాజ్యాంగపరమైన ఈ వివాదాన్ని కొలిక్కి తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ప్రతివాదులందరికీ నోటీసులు

'ఈ కేసు ఈ ఏడాది జనవరి 31న విచారణకు వచ్చినప్పుడు, మేము ఫిబ్రవరి 10కి వాయిదా వేశాం. ఆ సమయంలో సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, శేఖర్ నాఫ్డే తమ వాదనలు వినిపించారు. అప్పుడు ధర్మాసనం.. స్పీకర్ ఎప్పటిలోగా నిర్ణయం తీసుకుంటారో చెప్పగలరా? తద్వారా మేము ఉత్తర్వులు జారీ చేయకుండా ఉండవచ్చు అని నాడు రోహత్గీని ప్రశ్నించి, తదుపరి విచారణను ఫిబ్రవరి 20కి వాయిదా వేశాం. ఆ తదుపరి విచారణ సమయంలో రోహత్గీ మాట్లాడుతూ, స్పీకర్ పక్షాన తాము ఎటువంటి ప్రకటన చేయలేమని అసెంబ్లీ కార్యదర్శి సమాచారమిచ్చినట్టు పేర్కొన్నారు. ఈ రోజు మళ్లీ ఈ విషయాన్ని లేవనెత్తినప్పుడు (న్యాయవాదులు) డాక్టర్ సింఘ్వీ, రోహత్గీ అభ్యంతరం లేవనెత్తారు. ఈ కేసులో ప్రతివాదులకు అధికారికంగా (ఫార్మల్) నోటీసులు అందలేదు కాబట్టి జవాబు ఇవ్వలేకపోయాం అన్నారు. వారి అభ్యంతరం సాంకేతికపరమైనది అనడంలో సందేహం లేదు. సహజ న్యాయసూత్రాలను అనుసరించకుండా పిటిషన్లపై నిర్ణయం తీసుకున్నారంటూ తరువాత అభ్యంతరాలు వ్యక్తం కాకూడదు. అందువల్ల ప్రతివాదులందరికీ అధికారికంగా నోటీసులు జారీచేస్తాం' అని జస్టిస్ గవాయ్ అన్నారు. ఈ కేసులలోని ప్రతివాదులలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు స్పీకర్‌కు కూడా నోటీసు జారీచేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. తాము స్పీకర్ తరఫున వాదించడంలేదని, స్పీకర్ కార్యదర్శి తరఫున వాదిస్తున్నట్లు ఇద్దరు సీనియర్ న్యాయవాదులు చెప్పడంతో మూడు పద్ధతుల ద్వారా నోటీసులను జారీచేసింది. ఒకటి సుప్రీంకోర్టు నేరుగా నోటీసులు జారీచేసింది. తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ద్వారా స్పీకర్‌కు నోటీసులు అందజేయాలని ఆదేశించింది. అదేవిధంగా పిటిషనర్లు స్వయంగా నోటీసులను స్పీకర్‌కు అందజేసేందుకు కూడా అనుమతిచ్చింది. ఈ సమయంలో రాష్ట్రం తరఫు వాదించే న్యాయవాది ఎవరని కోర్టు ప్రశ్నించింది. ఎవరూ స్పందించకపోవడంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ద్వారా నోటీసులు ఇస్తామని హెచ్చరించింది. స్పీకర్, ఇతర ప్రతివాదులకు సుప్రీంకోర్టు జారీచేసిన నోటీసుల ఉత్తర్వు ప్రతి అధికారికంగా అందాల్సి ఉన్నది.

బీఆర్‌ఎస్ పిటిషన్లు

కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలంటూ బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. ఒక పిటిషన్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేయగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద్ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు.

గడువులోగా స్పీకర్ చర్యలు తీసుకోవాలి

తొలుత పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ, కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రాజ్యాంగంలోని 32, 226 అధికరణాల ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న విస్తృతాధికారాల మేరకు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలన్నారు. సుభాష్ దేశాయ్, కేశం మెఘచంద్, రాజేంద్రసింగ్ రాణా కేసుల్లో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం, సుభాష్ దేశాయ్ కేసులో ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం ఆ గడువు ఎంతో నిర్దేశించలేదని గుర్తుచేసింది. తిరిగి సుందరం వాదనలు కొనసాగిస్తూ, రాణా కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం నిర్దిష్ట గడువులోనే ఫిరాయింపుల పిటిషన్లను శాసనసభాపతులు పరిష్కరించాలని జవాబు చెప్పారు. స్పీకర్‌కు ఫిర్యాదు అందిన తర్వాత వాటిని మూడు నెలల్లోగా పరిష్కరించాలని అన్నారు.

స్పీకర్ లాయర్లం కాదు!

పిటిషనర్లు గత జూలైలో స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన వారానికే హైకోర్టుకు వెళ్లారని శాసనసభ కార్యదర్శి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అభిషేక్ మనుసింఘ్వీ తప్పుపట్టారు. నారిమన్ కేసులోని మార్గదర్శకాల ప్రకారం ఫిర్యాదుకు-పిటిషన్‌కు మధ్య తగిన గడువు ఉండాలని చెప్పారు. స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసిందని, ప్రతివాదుల నుంచి సమాధానం రావాల్సి వుందని చెప్పారు. రీజనబుల్ టైం పేరుతో వాయిదాలు వేయరాదని వ్యాఖ్యానించింది. తిరిగి సుందరం కల్పించుకుంటూ పార్టీ ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాలనే పిటిషన్లు దాఖలై ఏడాది గడిచిపోయినప్పటికీ ఇంకా ఫలితం లేదని, ఇప్పటికైనా సుప్రీంకోర్టు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ నుంచి పోటీ

ఫిరాయింపుదారుల్లో ఒకరు (ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్) సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేశారని, మరొకరు (స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి) తన కుమార్తె కాంగ్రెస్ పార్టీ టిక్కెట్‌పై పోటీ చేస్తే ఆమెకు మద్దతుగా లోక్‌సభ ఎన్నికల ప్రచారం చేశారని సుందరం చెప్పారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై గెలుపొందిన ఎమ్మెల్యేలందరూ సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకున్నారని వివరించారు. వ్యక్తిగతంగా ఎవరికి నచ్చిన రాజకీయాలు వాళ్లు చేయవచ్చునని, అయితే, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా ఉంటూ వేరే పార్టీ అభీష్టానికి అనుగుణంగా రాజకీయాలు చేయడం కుదరదని చెప్పారు. పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయిన వారు పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతూ ఇష్టమొచ్చినట్టుగా రాజకీయాలు చేస్తామంటే ఎలాగని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న చోట ఒకలా అధికారం లేని చోట మరొకలా వ్యవహరిస్తున్నదని చెప్పారు.

గాంధీభవన్‌కొస్తే సుప్రీం బోనులోకే!

- గూడెం మహిపాల్‌పై కాట గురి!
- పార్టీలో, న్యాయస్థానంలో దోషిగా నిలబెట్టేందుకు ప్రయత్నాలు
- వీడియో ఆధారాలు సమర్పించాలని ప్లాన్
- భయంతో పార్టీ కార్యకలాపాలకు గూడెం మహిపాల్ దూరం

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టుగా మారింది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి గోడ దూకిన గూడెంను అటు పార్టీలో, ఇటు సుప్రీంకోర్టు బోనులో దోషిగా నిలబెట్టడానికి ఆయన రాజకీయ ప్రత్యర్థి కాట శ్రీనివాస్ దూకుడుగా ప్రయత్నిస్తున్నారు. దీంతో మహిపాల్‌రెడ్డి ఆత్మరక్షణలో పడ్డట్టు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మంగళవారం గాంధీభవన్‌లో మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీ పరిస్థితిపై సమీక్ష నిర్వహించగా.. గూడెం మహిపాల్‌రెడ్డి గైర్హాజరయ్యారు. జంప్ జిలానీల కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో నడుస్తున్నందున ఈ సమావేశానికి హాజరైతే అడ్డంగా దొరికిపోతాననే భయంతో మహిపాల్‌రెడ్డి సమావేశానికి దూరంగా ఉన్నట్టు తెలిసింది. ఈ అవకాశాన్ని కాట శ్రీనివాస్ తనకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసినట్టు సమాచారం. పటాన్‌చెరులో మహిపాల్‌రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. కాంగ్రెస్ కార్యకర్తలపై గూడెం కేసులు పెట్టించారని, తమ మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం టీపీసీసీ వేసిన విచారణ కమిటీని లెక్కచేయడం లేదని, ఇప్పటి వరకు కమిటీ ముందు హాజరుకాలేదని కాట శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కాట ఫిర్యాదును మీనాక్షి నటరాజన్ సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. 'పార్టీకి అండగా నిలబడిన కార్యకర్తలను కాపాడుకోకపోతే ఎట్లా?' అని పక్కనే ఉన్న మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖను నిలదీసినట్టు తెలిసింది.

ఒకరినొకరు విమర్శించుకోవద్దు

కాట శ్రీనివాస్ ఫిర్యాదు పట్ల స్పందించిన మీనాక్షి నటరాజన్.. పార్టీ కోసం కష్టపడి పని చేసినవారి వివరాలు తానే స్వయంగా తెప్పించుకుంటున్నానని హామీ ఇచ్చినట్టు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల వల్ల సమస్యలు వస్తే పదవి నుంచి తొలగిస్తామని హెచ్చరించినట్టు తెలిసింది. సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నేతలు ఒకరినొకరు విమర్శించుకోవద్దని హితవు పలికినట్టు సమాచారం.